AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
5-1-2026 (Monday) MAIN EDITION

## భారత్‌పై సుంకాలు పెంచుతాం:ట్రంప్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి భారత్‌పై సుంకాలు పెంచుతానని హెచ్చరించారు. రష్యా నుంచి ముడి చమురు దిగుమతులు ఆపాలన్నారు. ఇప్పటికే ట్రంప్ భారత్ ఉత్పత్తులపై 50 శాతం టారిఫ్స్ విధించిన విషయం తెలిసిందే. పలు వస్తువులపై వంద శాతం వరకు సుంకాలు వేస్తున్నారు. దీంతో ఆ దేశంలో భారత వస్తువుల ధరలు భారీగా పెరిగాయి. ఈ కారణంగా అమెరికన్లు ఇతర దేశాల ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారు. కాగా.. రష్యా చమురు విషయంలో న్యూఢిల్లీ తమకు సహకరించకపోతే.. భారతీయ దిగుమతులపై ఉన్న ప్రస్తుత సుంకాలను మరింత పెంచుతానని ట్రంప్ తాజాగా ప్రకటించారు.

## విమానంలో సాంకేతిక లోపం..



**అక్షరటుడే, హైదరాబాద్:** ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. పైలెట్ ముందుగానే గుర్తించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సోమవారం ఉదయం శంషాబాద్ నుంచి సిలిగురి వెళ్తున్న ఫ్లైట్‌లో టెక్నికల్ ఇష్యూ తలెత్తింది. టేకాఫ్ అవుతున్న సమయంలో గుర్తించిన పైలెట్ అప్రమత్తం అయ్యాడు. వెంటనే ఏటీసీకి సమాచారం అందించాడు. దీంతో విమానాన్ని తిరిగి టెర్మినల్‌కు తరలించారు. కాగా.. ఆ సమయంలో విమానంలో 137 మంది ప్రయాణికులు ఉన్నారు.

## ఓఎన్జీసీ డ్రిల్ సైట్‌లో గ్యాస్ లీక్..



**అక్షరటుడే, ఏపీ:** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఓఎన్జీసీ డ్రిల్ సైట్ నుంచి గ్యాస్ లీకైంది. మలికిపురం మండలం ఇరుసుమండలో గ్యాస్ లీకై పైకి చిమ్ముతోంది. దీంతో మంటలు చెలరేగాయి. ఘటనాస్థలాన్ని తహసీల్దార్ శ్రీనివాసరావు పరిశీలించారు. ఓఎన్జీసీ సాంకేతిక నిపుణులు చేరుకుంటున్నట్లు తెలిపారు.

## బంగ్లాలో ఐపీఎల్ ప్రసారాలపై



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** తమ దేశంలో ఐపీఎల్ ప్రసారాలపై బంగ్లాదేశ్ ప్రభుత్వం నిషేధం విధించింది. బంగ్లాలో రాజకీయ అనిశ్చితి వల్ల హిందువులపై వరుస దాడులు జరుగుతున్నాయి. దీంతో ఐపీఎల్‌లో ఆ దేశానికి చెందిన ఆటగాడు ముస్తాఫిజుర్ రెహమాన్‌ను కేకేఆర్ టీం రిలీజ్ చేసింది. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్ ప్రభుత్వం ఐపీఎల్‌పై నిషేధం విధించింది.

## రాష్ట్రంలో 250 క్యాంటీన్ల ఏర్పాటు



**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలో ఇప్పటి వరకు 250 ఇందిరమ్మ క్యాంటీన్లు ఏర్పాటు చేశామని తెలంగాణ మంత్రి సీతక్క తెలిపారు. క్యాంటీన్ల నిర్వహణ, పెట్టుబడి కోసం స్వయం సహాయక సంఘాల సభ్యులకు వడ్డీలేని రుణాలు ఇస్తున్నట్లు చెప్పారు. శాసనసభలో సోమవారం ఆమె మాట్లాడారు.



**“** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బీఆర్ఎస్ పాలనపై తీవ్ర విమర్శలు చేశారు. కొంతకాలంగా కేటీఆర్, హరీశ్‌రావు ఇతర నాయకులను లక్ష్యంగా చేసుకుంటున్న ఆమె.. తాజాగా కేసీఆర్‌పై సైతం పరోక్షంగా వ్యాఖ్యలు చేశారు. శాసనమండలిలో సోమవారం ఆమె సుదీర్ఘంగా మాట్లాడారు. బీఆర్ఎస్ అవినీతి, కేసీఆర్ హయాంలో ప్రజలకు జరిగిన అన్యాయాలు, నాయకుల అక్రమాలను ప్రస్తావించారు. పార్టీలో తనకు ఎవరూ అండగా నిల్వ లేదని కంటతడి పెట్టారు. నైతికత లేని బీఆర్ఎస్ నుంచి వెళ్లిపోవడం సంతోషంగా ఉందన్నారు. అయితే త్వరలో రాజకీయ పార్టీ పెట్టబోతున్నట్లు ప్రకటించారు. ఆమె ప్రకటన రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

– అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

# బీఆర్ఎస్‌కు నైతికత లేదు..

■ ఆ పార్టీలో ప్రజాస్వామ్యం ఒక జోక్ ■ తనకు ఎవరూ అండగా నిల్వలేదు ■ కక్ష గట్టి పార్టీ నుంచి పంపించారు.. ■ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ■ శాసనమండలిలో కంటతడి

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో భారీగా అవినీతి జరిగిందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై తాను ప్రశ్నించినందుకు కక్ష గట్టి సస్పెండ్ చేశారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అంబేడ్కర్ విగ్రహం, అమరజ్యోతి, సచివాలయం, కలెక్టరేట్ల నిర్మాణంలో భారీగా అవినీతి జరిగిందన్నారు. సిరిసిల్ల, సిద్దిపేట, కలెక్టరేట్ల నిర్మాణంలో అవినీతి జరిగితే దిక్కులేదన్నారు. ఉద్యమకారులను బీఆర్ఎస్ నమ్మించి మోసం చేసిందని మండిపడ్డారు.

### నాయకుల దురాగతాలు

కేసీఆర్ చుట్టూ ఉండే కొందరు ప్రజాప్రతినిధులు దురాగాతాలకు పాల్పడ్డారని కవిత ఆరోపించారు. ఇసుక దందా చేసిన కొందరి వల్ల నేరెళ్ల ఘటన జరిగిందన్నారు. దానిపై నాటి బీఆర్ఎస్, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. బోధన్ షుగర్ ఫ్యాక్టరీ విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కేసీఆర్ తన చుట్టూ ఉండే నాయకులు అనేక దురాగతాలు చేస్తున్నా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చడాన్ని తాను వ్యతిరేకించానన్నారు. తెలంగాణ బిల్లు ఆమోదం పొందిన తర్వాత కాంగ్రెస్‌లో టీఆర్ఎస్ విలీనంపై చర్చలు జరిగాయన్నారు. అయితే పార్టీ ఒంటరిగా పోటీకి నిర్ణయించిందన్నారు. 2014 ఎన్నికల్లో తనను పిలిచి నిజామాబాద్ ఎంపీ టికెట్ ఇచ్చారన్నారు. తాను ఎవరిని టికెట్ అడగలేదని చెప్పారు. పదవుల కోసం తాను టీఆర్ఎస్‌లోకి వెళ్లలేదన్నారు. పార్టీ చెప్పడంతో ఎంపీగా పోటీ చేసి గెలిచానని తెలిపారు. మొదటి రోజు నుంచే తనను అడ్డుకోవడానికి కుట్ర చేశారని కన్నీళ్లు పెట్టుకున్నారు.

### అండగా నిల్వలేదు

ఎనిమిది ఏళ్లుగా ప్రజల కోసం తాను చేస్తున్న ప్రయత్నాన్ని అడ్డుకున్నారని కవిత అన్నారు. పార్టీ మౌత్‌పీస్‌గా ఉన్న ఛానెళ్లు, పేపర్లు ఏనాడూ మద్దతు ఇవ్వలేదన్నారు. బీజేపీ సైతం తెలంగాణను మోసం చేసిందన్నారు. బీజేపీపై తాను పోరాటం చేశానని చెప్పారు. కేసీఆర్‌పై కక్షతో ఆ పార్టీ తనను జైల్లో పెట్టిందన్నారు. అయినా ఏనాడూ బీఆర్ఎస్ తనకు అండగా నిలబడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మూడేళ్లు తాను ఒంటరిగా ఈడీ, సీబీఐతో పోరాటం చేశానని చెప్పారు.

### త్వరలో కవిత కొత్త పార్టీ..

మండలిలో మాట్లాడిన అనంతరం కవిత గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్దకు వెళ్లి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తాను ఇవాళ అన్ని బంధనాలు తెంచుకొని బయటకు వస్తున్నట్లు తెలిపారు. ఇది కేవలం ఆత్మగౌరవం కోసం జరుగుతున్న పోరాటం మాత్రమే కాదని.. ప్రజా సమస్యలపైనే తన పోరాటమన్నారు. తనలాగే తెలంగాణ ఆడబిడ్డలకు రోషం ఎక్కువని, యువత కోసం కొత్త రాజకీయ వేదిక రాబోతోందని తెలిపారు. వామపక్ష నేతలు, మావోయిస్టు సానుభూతిపరులు, ప్రజాస్వామ్యవాదులు తమతో పనిచేయాలనుకునే వారందరికీ ‘తెలంగాణ జాగృతి’ ఆహ్వానం పలుకుతోందని తెలిపారు.

## సుప్రీంకోర్టులో హరీశ్‌రావుకు ఊరట



**అక్షరటుడే, హైదరాబాద్:** ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. మాజీ మంత్రి హరీశ్‌రావుకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణ వేగవంతం చేసిన విషయం తెలిసిందే. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ రావును అధికారులు ఆదివారం 8 గంటల పాటు విచారించారు. అయితే అప్పటి ప్రభుత్వ పెద్దలను విచారించేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. హరీశ్‌రావు విచారణకు అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం ఉదయం కొట్టేసింది.

## బీఆర్ఎస్ సభ్యులు భయపడి వెళ్లిపోయారు: భట్టి



**అక్షరటుడే, హైదరాబాద్:** పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుపై చర్చ అనగానే బీఆర్ఎస్ సభ్యులు భయపడి సభ నుంచి వెళ్లిపోయారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. అసెంబ్లీ వద్ద మీడియా చిట్‌చాట్‌లో మాట్లాడారు. సమావేశాలను బహిష్కరించడంపై బీఆర్ఎస్ సమాధానం చెప్పాలని భట్టి డిమాండ్ చస్త్రశారు. అన్ని అంశాలపై చర్చించాలని బీఏసీలో బీఆర్ఎస్ పార్టీనే పట్టుబట్టిందన్నారు. వాళ్ల కోరిక మేరకే అన్ని అంశాలపై చర్చ పెడుతున్నామని తెలిపారు. వాళ్లకు ఇబ్బందైన రోజు వాకౌట్ చేశారంటే ఓకే కానీ, మిగతా రోజులు కూడా రాకపోవడానికి కారణమేమిటని ప్రశ్నించారు.

## మాతృభాషను మరవొద్దు..: చంద్రబాబు



**అక్షరటుడే, ఏపీ:** మాతృభాష మన మూలాలకు సంకేతమని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఆంగ్లం అవసరమే కానీ.. మాతృభాషను మరిచిపోతే మనల్ని మనమే కోల్పోయినట్లు అవుతుందన్నారు. గుంటూరులో నిర్వహిస్తున్న ప్రపంచ తెలుగు మహాసభల్లో ఆయన మాట్లాడారు. దేశంలోనే తెలుగు భాషకు ఘనమైన చరిత్ర ఉందని వివరించారు. మన దేశంలో వందల భాషలు ఉన్నా.. కేవలం ఆరింటికే ప్రాచీన హోదా లభించిందన్నారు. హిందీ, బెంగాలీ, మరాఠీ తర్వాత దేశంలో ఎక్కువగా మాట్లాడే భాష తెలుగు అని చెప్పారు.

## పీవోకేను భారత్‌లో విలీనం చేయాలి: బ్రిటన్ ఎంపీ



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** జమ్మూ కశ్మీర్‌పై బ్రిటన్ ఎంపీ బాబ్ బ్లాక్‌మన్ కీలక వ్యాఖ్యలు చేశారు. పీవోకే సహా జమ్మూకశ్మీర్ మొత్తాన్ని భారత్‌లో విలీనం చేయాలని భారత ప్రభుత్వానికి సూచించారు. కశ్మీర్‌ను పాక్ ఆక్రమించడాన్ని తాను గతంలోనూ వ్యతిరేకించానని.. ఎప్పటికీ వ్యతిరేకిస్తూనే ఉంటానన్నారు. ఆర్టికల్ 370 రద్దును ఇప్పుడు కాకుండా 1992లో కశ్మీరీ పండితుల వలసల కన్నా ముందే చేపట్టాల్సిందని అభిప్రాయం వ్యక్తం చేశారు. జైపూర్‌లో జరిగిన హై టీ కార్యక్రమంలో బ్రిటన్ ఎంపీ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

## ఆ మోసాల వలలో పడొద్దు: దుబాయ్ అడ్వైజరీ



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఉద్యోగార్థులకు దుబాయ్ పోలీసులు అడ్వైజరీ జారీ చేశారు. నకిలీ వర్క్ వీసా స్కాంలో పడొద్దని హెచ్చరించారు. తప్పుడు ఉద్యోగ ఆఫర్లు, చట్టవ్యతిరేక వీసా హామీలతో స్కామర్లు బురిడీ కొట్టిస్తున్నారని అడ్వైజరీలో పేర్కొన్నారు. ఈ మేరకు అంతర్జాతీయ మీడియా కథనం పేర్కొంది. అధికారిక మార్గాలు, ప్రభుత్వ లైసెన్స్ పొందిన నియామక సంస్థల ద్వారా ఉద్యోగ ఆఫర్లను ధ్రువీకరించుకోవాలని సూచించారు. ఈ తరహాలో ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని పోలీసులు ప్రజలకు సూచించారు. ఉపాధి కల్పిస్తామంటూ, వీసా హామీల విషయంలో ఎలాంటి ముందస్తు చెల్లింపులు చేయొద్దని హెచ్చరించారు.

## అమెరికాలో యాక్సిడెంట్.. ఏపీకి చెందిన దంపతుల మృతి



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన దంపతులు మృతి చెందారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన కొటికలపూడి కృష్ణ కిశోర్(45), ఆశ (40) వాషింగ్టన్‌లో జరిగిన యాక్సిడెంట్‌లో చనిపోయారు. ఈ ఘటనలో వారి కుమారుడు, కుమార్తె తీవ్రంగా గాయపడ్డారు. ఈ మేరకు అమెరికా నుంచి పాలకొల్లులోని వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ‘రాజాసాబ్’ సెట్‌లో ఇబ్బంది పెట్టారు..



ప్రభాస్‌తో సినిమాలో నటిస్తే.. ఆయన ఎక్కువ ఫుడ్ పెట్టి, వద్దు బాబోయ్ అని చెప్పినా వినకుండా మొహమాటంతో కూడిన ఇబ్బంది పెడతారని అందరికీ తెలిసిందే. అయితే అదంతా డార్లింగ్ ప్రేమ కారణంగా జరిగేది. అయితే తొలిసారి ఓ హీరోయిన్ సినిమా షూటింగ్ వల్ల ఇబ్బందిపడిందట. మూడు రోజుల పాటు ఓ సీన్ చేయగా.. దాదాపు నరకం చూశాను అని కామెంట్స్ చేసింది. ఆ వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. ‘ది రాజాసాబ్’ సినిమాలో ప్రముఖ మలయాళ కథానాయిక మాళవిక మోహనన్ ఓ నాయికగా నటించింది. సినిమా విడుదల సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. నా సోలో సీన్ కోసం మూడు రోజులు ఓ పెద్ద స్విమ్మింగ్‌పూల్‌లో షూట్ చేశాం. ఆ మూడు రోజులు రోజుకు 10 గంటలు నీళ్లలోనే ఉండాల్సి వచ్చింది. ఒకవైపు చలికి చర్మం మొద్దుబారిపోతున్నట్లు అనిపిస్తుండేది.. ఆ నీళ్లలో అందరూ అందులోకి దిగి షూట్ చేసేవారు. పెయింట్స్, కెమికల్స్, వాడిపారేసిన వస్తువులు అన్నీ ఆ నీటిలోనే వేసేసేవారు. అలాంటి నీటిలో మూడు రోజులు షూటింగ్ చేశాం. అదొక వింత అనుభవం అని మాళవిక చెప్పింది.

–అక్షరటుడే, సినిమాడెస్క్

## అమెరికాలో తెలుగు యువతి హత్య



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికాలో తెలుగు యువతి దారుణ హత్యకు గురైంది. వారం క్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిఖిత గొడిశాల (27) అనే యువతి ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లింది. మేరీలాండ్‌లోని కొలంబియాలో ఉన్న ఆమె వారం రోజుల నుంచి కనిపించడం లేదు. తాజాగా ఆమె మృతదేహాన్ని మాజీ ప్రియుడు అర్జున్ అపార్ట్‌మెంట్‌లో పోలీసులు గుర్తించారు. దీంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అర్జున్ శర్మనే హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రస్తుతం అతడు పరారీలో ఉన్నాడు. అయితే అతడు భారత్‌కు వచ్చినట్లు సమాచారం. పోలీసులు నిందితుడి కోసం గాలిస్తున్నారు. కాగా.. నిఖిత సికింద్రాబాద్ ప్రాంతానికి చెందిన యువతిగా సమాచారం.